జీహెచ్ఎంసీ అధికారులపై ప్రజావాణిలో ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉండే ఎస్టేట్ ఆఫీసర్ భాషా, జీహెచ్ఎంసీ–14 అబిడ్స్ సర్కిల్‌లో ఉండే అసిస్టెంట్ స్టేట్ ఆఫీసర్ వినోద్‌లు పలు అక్రమాలకు పాల్పడుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆనంద్‌కుమార్‌గౌడ్ లిఖిత పూర్వకంగా కమిషనర్ రొనాల్డ్‌రాస్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులను అందజేశారు. కోఠిలోని కామత్‌హోటల్ పక్కన జీహెచ్ఎంసీకి చెందిన 12 షాపులు ఉన్నాయన్నారు. ఏడాదిన్నరగా ఎస్టేట్ ఆఫీస్ భాషా, 14వ సర్కిల్ అసిస్టెంట్ స్టేట్ ఆఫీసర్ వినోద్‌లు ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా షాపులను కేటాయిస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. టెండర్లు లేకుండా ఎలా షాపులు కేటాయిస్తారని ప్రశ్నించారు. వెంటనే విచారణ జరిపి షాపులను టెండర్ల ద్వారా ఇవ్వాలని, అక్రమ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, కిరణ్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రంలో జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం కేలండర్‌ను ఆవిష్కరించిన ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేకపోయిందన్నారు. బీఆర్ఎస్ చేసిన మోసాలను గమనించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభయహస్తం గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



గంపప్ప నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న ట్రస్మా, శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

జియాగూడ: విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు ఇష్టపడి చదివితే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని మోటివేషన్ స్పీకర్ గంపప్ప నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం జియాగూడ ఎస్‌బీఏ గార్డెన్‌లో శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ నేతృత్వంలో ఆసిఫ్‌నగర్ మండల్ ట్రాస్మా స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల జీవన శైలీ క్రమ శిక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. పరీక్షా సమయంలో ఏ మాత్రం ఆందోళన చెందకుండా ఎంతో ఓర్పుతో పరీక్షలను రాయాలన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావును విద్యా సంస్థల ప్రతినిధి సురేష్, ట్రస్మా గౌరవాధ్యక్షులు గాలయ్య సన్మానించారు. అలాగే శ్రీచైతన్య ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ కేంద్ర కార్యాలయ ప్రధాన విద్యాధికారి సురేష్, ఏజీఎం కృష్ణ, రీజినల్ ఇన్‌ఛార్జ్ హరికృష్ణ,కో ఆర్డినేటర్ రవి,అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి జితేందర్ సింగ్, కోశాధికారి శైలేందర్, రత్నేష్ జైస్వాల్, నాగేశ్వర్, అనిల్‌కుమార్, రామ్‌కుమార్, మిథిలేష్ కుమార్, ప్రవీణ్, శివకుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

19న ఛత్రపతి శివాజీ మహా శోభాయాత్ర


బ్రోచర్ విడుదల చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవాదళ్ ప్రతినిధులు

జియాగూడ: ఈ నెల 19న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని చత్రపతి శివాజీ మహరాజ్ సేవాదళ్ ఆధ్వర్యంలో మహా శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్ తెలిపారు. సోమవారం జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో మహా శోభా యాత్రను బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..జియాగూడ కేసరి హనుమాన్ ఆలయం నుంచి మహా శోభాయాత్రను సోమవారం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిద్ధయోగి స్వామి శ్రీచైతన్య ఆనంద మహారాజ్ హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ వివేక్ సింగ్, విశాల్ సింగ్, కృష్ణవారి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గంలో నడిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులతో కలిసి నివాళులర్పిస్తున్న సుబ్బారావు తదితరులు

లంగర్‌హౌస్: గాంధీ మార్గంలో నడిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు జి.వి.సుబ్బారావు అన్నారు. ఫిబ్రవరి 12న లంగర్‌హౌస్ త్రివేణి సంగంలో మహాత్మా గాంధీ అస్థికలు నిమర్జనం చేసిన రోజు సందర్భంగా బాపూఘాట్‌లో బాపూ సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి, బాపూస్మృతి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని గాంధీజీ జీవనపై పాటలు, వకృత్వంలో పోటీ పడుతు ఉపన్యాసాలు ఇచ్చి ఆకట్టుకున్నారు. చిన్న వయస్సు నుంచే గాంధీ అవలంభించిన మార్గాలను నేర్పే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. అనంతరం విద్యార్థులతో బాపూసమాధిపై పూలు పెట్టి నివాళులర్పించారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి, బాపూస్మృతి పెద్దలు రంగారావు, బాపిరాజు, చంటిబాబు, రఘుపాల్ రెడ్డి, పరమానందం, ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, అమర్‌నాథ్, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో 'బూత్ ప్రవాస్ యోజన'


కరపత్రాన్ని అందజేస్తున్న గోపాల్‌జీ

అబిడ్స్: బీజేపీ ఆధ్వర్యంలో బూత్ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. బేగంబజార్‌లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ కార్యక్రమంలో పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్‌సింగ్, జుగల్ కిశోర్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడిగా విజయ్‌యాదవ్



అబిడ్స్: రాష్ట్ర యాదవ మహాసభ (హైయిర్) అధ్యక్షుడిగా విజయ్‌యాదవ్ నియమితులయ్యారు. బీజేపీ గోల్కొండ జిల్లా జీహెచ్ఎంసీ ఇన్‌చార్జ్ విజయ్‌యాదవ్‌ను నియమిస్తూ మహాసభ అఖిలభారత యాదవ హైయిర్ సమాజ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా విజయ్ యాదవ్ మాట్లాడుతూ..బేగంబజార్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర నలుమూల పర్యటిస్తూ యాదవ సమాజ్ అభివృద్ధి, యాదవ సమాజ్ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

తాగిన మైకంలో భార్యపై దాడి

– గర్భస్థ శిశువు మృతి

అబిడ్స్: తాగిన మైకంలో ఓ వ్యక్తి భార్యను విపరీతంగా కొట్టడంతో ఆమె కడుపులోని శిశువు మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళ్‌హాట్‌కు చెందిన విజయ్‌సింగ్‌కు, జిన్సీచౌరాహికి చెందిన పూజసింగ్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. పూజసింగ్ 8 నెలల గర్భవతి. బేగంబజార్‌లోని ఓ ప్రైవేటు దుకాణంలో పనిచేసే విజయ్‌సింగ్ రోజూ భార్యను కొట్టేవాడు. ఈనెల 7న విజయ్‌సింగ్ తాగిన మైకంలో భార్య పూజసింగ్‌తో గొడవకు దిగి విపరీతంగా కొట్టాడు. దీంతో ఆమె జిన్సీచౌరాహిలోని పుట్టింటికి వెళ్లింది. 8న పూజసింగ్‌కు కడుపులో విపరీతమైన నొప్పి రావడంతో ఆమె తల్లి స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లింది. మందులు తీసుకుని ఇంటికి వచ్చినప్పటికీ 9న కడుపునొప్పి పెరగడంతో పూజసింగ్‌ను నిలోఫర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు స్కానింగ్ చేయగా గర్భంలోని శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు. శస్త్ర చికిత్స చేసి శిశు మృతదేహాన్ని బయటకు తీశారు. మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసి విజయ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- పట్టుబడితే వారితో పాటు యజమానులపై కూడా కేసులు
- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- జాతీయ భద్రతా దినోత్సవాల సందర్భంగా దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీతో ఇంటర్వ్యూ


చంద్రశేఖర్‌రెడ్డి, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ

చార్మినార్: మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు వాహనాల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మైనర్లు తమ వాహనాలను తీసుకెళ్లకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తమ చిన్నారులకు ఆటోరిక్షాలలో పాఠశాలలకు తరలించరాదన్నారు. లెక్కకు మించిన విద్యార్థులను ఆటోలలో పంపితే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమతమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన వాహనదారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆయన సోమవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ట్రాఫిక్ నిబంధనల అమలు కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

◆ **జవాబు:** ప్రధాన కూడళ్ల వద్ద అవసరమైన మేరకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాకుండా కళాశాల, పాఠశాల విద్యార్థులకు సైతం అవగాహన కల్పిస్తున్నాం. స్పెషల్ అవేర్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: సాధారణంగా వాహనదారులు చేసే పొరపాట్లు ఏమిటి?

◆ **జవాబు:** మద్యం సేవించి వాహనం నడపడం. ఇది సాధారణంగా వాహనదారులు చేస్తున్న తప్పు. దీంతో వీరి ప్రాణాలను రక్షణ లేకుండా పోవడంతో పాటు ఇతర వాహనదారులకు కూడా ప్రమాదం కలిగే అవకాశాలున్నాయి.

ప్రశ్న: పాతబస్తీ దక్షిణ మండలం పరిధిలో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందా?

◆ **జవాబు:** దక్షిణ మండలం పరిధిలో ప్రతిరోజూ డంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కేవలం వీటిపైనే కాకుండా త్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ తదితర కేసులు సైతం నమోదు చేశాం.

ప్రశ్న: గత నెల రోజులుగా నమోదైన కేసుల వివరాలు?

◆ **జవాబు:** గత నెల 1వ తేదీ నుంచి ఈనెల 12వ తేదీ వరకు హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపిన 58,150 వాహనదారులపై చలాన్లు విధించాం. అలాగే రాంగ్ సైడ్ డ్రైవింగ్–3984, డ్రంకెన్ డ్రైవింగ్–598, త్రిపుల్ రైడింగ్–3149, సెల్‌ఫోన్ డ్రైవింగ్–1524, మైనర్ డ్రైవింగ్–73, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు–726, నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలు–1127.

ప్రశ్న: మైనర్ల విషయంలో..?

◆ **జవాబు:** డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లతో పాటు వాహనాల యజమానులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. మైనర్‌లకు వాహనాలను ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం. గతంలో తాము నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన మైనర్లతో పాటు వాహనాల ఓనర్లపై కూడా కేసులు నమోదు చేయగా జైలుకెళ్లారన్నారు.

ప్రశ్న: దక్షిణ మండలంలో ఎన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లున్నాయి..అవి ఏవేవీ..?

◆ **జవాబు:** చార్మినార్, మీర్‌చౌక్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా అనే నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లున్నాయి.

ప్రశ్న: వాహనదారులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏవైనా ఉన్నాయా..?

◆ **జవాబు:** ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమను తాము ప్రమాదాల నుంచి రక్షించుకోవాలి. మద్యం సేవించి వాహనాలను నడపరాదు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదు. అధిక వేగంతో వాహనాలను నడుపరాదు. త్రిబుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలి.

రేపటి నుంచి బెంగాలీల సరస్వతి పూజలు

చార్మినార్: వసంత పంచమి సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం బెంగాలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సరస్వతి పూజలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. బెంగాలీలు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు పూజలు నిర్వహించనున్నారు. 16న శుక్రవారం సాయంత్రం సరస్వతి విగ్రహంతో పెద్ద ఎత్తున నిమజ్జన ఊరేగింపు నిర్వహించనున్నారు. మీరాలంమండి నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు పంజేషా, గుల్జార్ హౌజ్, మదీనా, నయాపూల్, అఫ్జల్‌గంజ్ ద్వారా ట్యాంక్‌బండ్ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఊరేగింపు అనంతరం ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం జరుగుతుందన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం'


దేవర శ్రీనివాస్

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాలను బీజేపీ క్లీన్ స్వీప్ చేస్తుందని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే తనంతటతానుగా కూలిపోవడం ఖాయమని ఇది మూనాళ్ల ముచ్చటగానే మారిపోతుందన్నారు. అంతేకాకుండా బీఆర్ఎస్ పార్టీ కూడా వచ్చే పార్లమెంటు ఎన్నికల తర్వాత పూర్తిగా కనుమరుగవుతుందని ఆయన అన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధి చెందుతున్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు అని దేశ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. కేంద్ర మంత్రి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని పార్లమెంటు స్థానాలు తామే గెలుస్తామని ఆయన పేర్కొన్నారు.

గ్రానైట్ రోడ్లపై వ్యర్థాలు వేయొద్దు


సరిత

చార్మినార్: చార్మినార్, మక్కా మసీదులోని గ్రానైట్ రోడ్లపై ఇష్టానుసారంగా హోటళ్ల వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాన్ని వేయొద్దని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత అన్నారు. హోటళ్ల వ్యర్థ పదార్థాలతో గ్రానైట్ రోడ్ల సహజత్వం కోల్పోతుందన్నారు. ఇక నుంచి గ్రానైట్ రోడ్లపై ఎలాంటి వ్యర్థాలను వేయరాదన్నారు. ఒకవేళ వేస్తే చలాన్లు విధిస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ

అఫ్జల్‌గంజ్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అఫ్జల్‌గంజ్ నూతన ఇన్‌స్పెక్టర్ హరిభూషన్‌రావు అన్నారు. సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సైబర్ క్రైమ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను పోలీసు ఉన్నతాధికారులు అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఇంతకు ముందు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోషంను పోలీసు ఉన్నతాధికారులు ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేశారు.

చలామణి లేని నోట్లను ఇచ్చి.. రూ.8 లక్షలతో పరార్

జియాగూడ: మాయమాటలు చెప్పి చలామణిలో లేని రూ.వెయ్యి నోట్లు రూ. కోటి ఓ వ్యక్తికి అంటగట్టి అతని వద్ద నుంచి రూ.8 లక్షలతో పరారైన ఇద్దరిని కుల్సుంపురా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జియాగూడ ఇందిరానగర్ సోనా హోటల్ ప్రాంతానికి చెందిన గణేష్ ఇడ్లీ వ్యాపారి. ఈ నెల 10న మల్లేపల్లికి చెందిన కశ్యప్, సాధిక్ శనివారం స్నేహితుడైన గణేష్ వద్దకు వచ్చి తమ వద్ద రూ.కోటి విలువ చేసే వెయ్యి రూపాయాల నోట్లు ఉన్నాయని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని మాయమాటలు చెప్పి బోల్తా కొట్టించి కోటి రూపాయాలు గణేష్‌కు ఇచ్చి అతని వద్ద నుంచి రూ.8 లక్షలను తీసుకుని పరారయ్యాడు. అనుమానం వచ్చిన గణేష్ ఆదివారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల బృందం మల్లేపల్లిలో నిందితులు ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. గణేష్ వద్ద నుంచి వెయ్యి రూపాయాల నోట్లు కూడా స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

వితల్ ముదిరాజ్‌కు సన్మానం


వితల్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న బండారి ప్రకాష్ తదితరులు

గోల్కొండ: అయోధ్య రామ్‌లల్లా దర్శనం జీవితంలోని అత్యంత ముఖ్యమైన ఘట్టమని గుడిమల్కాపూర్‌లోని అన్నపూర్ణ ఆలయ కమిటీ సభ్యుడు వితల్‌ముదిరాజ్ అన్నారు. బైక్‌పై ఆయన అయోధ్య వెళ్లి నగరానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు బంగారి ప్రకాష్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వితల్‌ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. వితల్‌ముదిరాజ్ మాట్లాడుతూ..రామ్‌లల్లాను దర్శించుకోవడానికి వెళ్తున్నాన్న మాటలు తన మెదడులో, మనస్సులో నాటుకుపోయి ఉన్నాయని అన్నారు. బండారి ప్రకాష్ మాట్లాడుతూ.. వితల్‌ముదిరాజ్ అందరికి ఆదరనీయుడు, ఆదర్శ పురుషుడని అన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో 'అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'



గోల్కొండ: అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న వారే సాంకేతిక రంగంలో అద్భుతాలు సాధించగలుగుతారని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో వల్నెరబిలిటి అసెస్‌మెంట్ అండ్ పెనిట్రేషన్ టెస్టింగ్ ఆఫ్ వెబ్ అప్లికేషన్ కార్యక్రమం జరిగింది. అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌లో భాగంగా సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఏఐసీటీఈ వారి అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ వల్ల అధ్యాపకులకు, విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌రెడ్డి, ఐటీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రాంచరణ్, కోఆర్డినేటర్ డాక్టర్ సుప్రియారెడ్డి, డి.వందన పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సంగీత, నృత్యోత్సవం



అకాడమీ విద్యార్థులతో డాక్టర్ రాధా మోహన్

నాంపల్లి: విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జాతీయ స్థాయి సంగీత, నృత్యోత్సవం వేడుకలు–4 జరిగాయి. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంగీత విభాగం విద్యార్థులు పలు దేశభక్తి గీతాలు, కీర్తనలు, జానపద గేయాలను ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అభిమన్య ఇంటర్నేషనల్ కల్చరల్ సెంటర్–ముంబై డైరెక్టర్ డాక్టర్ రాధామోహన్, డాక్టర్ మోహన్ మేకల హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ప్రొఫెసర్ శశికళారెడ్డి, ప్రముఖులు ఝన్సీరాణి, అనూ ప్రసాద్, అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బజరంగ్‌సేనా నాయకుల అరెస్ట్



అబిడ్స్: ఎంజే మార్కెట్‌లో బజరంగ్‌సేనా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వాలంటైన్ డేకు వ్యతిరేకంగా గ్రీటింగ్ కార్డులు దహనం చేసేందుకు ప్రయత్నించిన సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు లచ్చు గుప్తా (ఎస్ఆర్, లక్ష్మణ్‌రావు) రాష్ట్ర ఇతర నాయకులు సూర్యప్రకాష్ శుక్లా, మనోజ్, సునీల్ అగర్వాల్, చంచల్ సుగంధ, ఆచార్య ప్రమోద్, శాస్త్రీలను అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 14వ తేదీన ఎవరైనా వాలంటైన్స్ డే వేడుకలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్‌ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టోలిచౌకీ–హకీంపేట్ రోడ్డు అత్యంత రద్దీగా ఉంటుందని తవ్వకాలు పనులు జరుగుతున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా టోలిచౌకీ నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వారు కూడా తవ్వకాల కారణంగా అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. హకీంపేట్ లిమ్రా చౌరస్తా, ప్యారమౌంట్ కాలనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో కూడా ఆయన పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ కార్వాన్, లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్, డిఫెన్స్ కాలనీ, బాపూనగర్, మెహిదీ కాలనీ, జితేందర్ ఫ్లోర్‌మిల్, లంగర్‌హౌస్, రింగ్‌రోడ్, వినాయకనగర్, హరిదాస్‌పుర, అలంకార్ థియేటర్, నేతాజీ నగర్, శ్రీనివాస్‌నగర్, జ్యోతినగర్, సర్దార్‌బాగ్, మొఘల్ కా నాలా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ ఏఎస్ఆర్ఆర్ నగర్ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్, సత్యనారాయణ నగర్, క్రిస్టల్ గార్డెన్, గుడిమల్కాపూర్, హీరా నగర్, సాయినగర్, పవన్ గార్డెన్, కేఆర్‌కేఎం గార్డెన్, శివబాగ్, మహేష్‌నగర్, రూఫ్ గార్డెన్, నయాఖిల్లా, ఝిన్సీ బజార్, తాకత్ బౌలీ, రాఘవమ్మ కంచ, హీరాఖానా 1, 2, మోతిమహల్, ఖాజీ గల్లీ, ఒవైసీ పాఠశాల, ఫాల్కన్ వల్లీ, వెటర్నరీ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండన్నారు.

మెమొంటో అందజేత


మెమొంటో అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ 45వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో నివసిస్తున్న ఇరాన్ ప్రజలందరికీ బీజేపీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ మెహదీ షారుఖీ కి మెమొంటో అందజేసి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు.

నియామకం



శ్యామ్‌కుర్మను అభినందిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడిగా కనకాల శ్యామ్ కుర్మ ఎంపికయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా బీసీ ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా పనిచేసిన శ్యామ్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అదేవిధంగా యువజన విభాగం జాతీయ ఉపాధ్యక్షుడిగా ఆర్.నరేష్‌కుమార్ ప్రజాపతిని ఎన్నుకున్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సెయింట్ ఆడమ్స్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి ఉత్సవ్ పేరిట నిర్వహించిన సాంస్కృతిక అంశాలను ఆహుతులను ఆకట్టుకున్నాయి. జై శ్రీరామ్ అంటూ ఆలపించిన భక్తి భజన కీర్తనలు, సంస్కృతులను ప్రతిబింబించేలా చిన్నారుల నృత్యాలు సమ్మోహన పరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భాష్యం శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన ఎం.ఎస్సీ ఫిజిక్స్ బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.బాల భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉత్తీర్ణతతో పాటు పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. కళాశాల విద్య జారీ చేసిన నియమ నిబంధనలను అనుసరించి ఎంపికైన వారికి జీతాలు చెల్లించబడతాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యరులు ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు తమ ధ్రువపత్రాలతో ఫిజిక్స్ శాఖాధిపతిని సంప్రదించాలని ఆయన కోరారు.

ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టిన కారు



నాంపల్లి: మద్యాన్ని సేవించిన ఇద్దరు యువకులు కారులో ప్రయాణిస్తూ ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టారు. ఈ ఘటన ఆదివారం రాత్రి మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చార్మినార్‌కు చెందిన నితిన్ అగర్వాల్ (26), తన మిత్రుడు, అత్తాపూర్‌కు చెందిన ఆదిత్య (26) ఇద్దరూ కలిసి అర్ధరాత్రి మద్యం సేవించారు. మద్యాన్ని సేవించిన ఇద్దరూ ఎన్ఎండీసీ నుంచి లక్డీకాపూల్ వైపు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మాసబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తూ రీలింగ్ గోడను ఢీకొట్టారు. దీంతో కారు పూర్తిగా దెబ్బతింది. కారులో ఉన్న ఇద్దరు యువకులు క్షేమంగా బయటపడ్డారు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మల స్థాపన పూజలు


హోమంలో పాల్గొన్న మదిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: ఇమాంపురాలో బొడ్రాయి, రేణుకా ఎల్లమ్మల స్థాపన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఇమాంపురాలోని నవభారత్ సంఘం కమ్యూనిటీహాల్ వద్ద 64 దేవతల పూజ, ముక్కోటి దేవతా పూజలు, వాస్తు, నవగ్రహ తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. నేటి నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజు వివిధ రకాల పూజలను నిర్వహిస్తున్నట్లు ఎన్‌బీఎస్ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎ.యాదయ్య, ఆర్.బాలకిషన్, జి.వినయ్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, డి.లక్ష్మీనారాయణ, జె.నర్సింహ, జగదీష్, నర్సింగ్‌రావు, టి.బాబు, సత్యనారాయణ, ఎం.సురేందర్, గౌతమ్ పాల్గొన్నారు.